# మాదిరి ప్రార్థన

## (మత్తయి 6:9-15; లూకా 11:1-4)

నీవు తెలిసికోగోరేదేమి? పిల్లలకు సవాలక్ష ప్రశ్నలుంటాయి – వాటిలో అనేకులు "ఎందుకు" అనేదానితో ఆరంభమౌతాయి. నవయువతకు ఏమి చదువుకోవాలి, ఏ వృత్తిని చేపట్టాలి అనేవాటిమీద మనస్సు పెడతారు. పెద్దవారు జీవితంలో ఎలా అభివృద్ధి చెందాలి[1] అని కోరుకుంటారు. యేసు శిష్యులైతే, "ఎలా ప్రార్థించాలో" తెలిసికో గోరారు: "ఆయన యొక చోట ప్రార్థన చేయుచుండెను. ప్రార్థన చాలించిన తరువాత ఆయన శిష్యులలో ఒకడు – ప్రభువా, యోహాను శిష్యులకు నేర్పినట్టుగా మాకును ప్రార్థన చేయనేర్పుమని ఆయన నడిగెను" (లూకా 11:1). క్రీస్తు యిచ్చిన జవాబు "ప్రభువు ప్రార్థన" అని పిలువబడింది.

> మీరు ప్రార్థన చేయునప్పుడు – తండ్రీ, నీ నామము పరిశుద్ధ పరచబడునుగాక, నీ రాజ్యము వచ్చునుగాక, మాకు కావలసిన అనుదినాహారము దినదినము మాకు దయచేయుము, మేము మాకచ్చియున్న ప్రతివానిని క్షమించుచున్నాము గనుక మా పాపములను క్షమించుము; మమ్మును శోధనలోనికి తేకుము అని పలుకుడని వారితో చెప్పెను (లూకా 11:2-4).

కొండమీద ప్రసంగంలో, మత్తయి 6 నందు బహు ఎక్కువైన రూపంలో ఈ ప్రార్థన కన్పిస్తుంది:

> కాబట్టి మీరీలాగు ప్రార్థన చేయుడి, – పరలోకమందున్న మా తండ్రీ, నీ నామము పరిశుద్ధపరచబడును గాక; నీ రాజ్యము వచ్చుగాక; నీ చిత్తము పరలోకమందు నెరవేరుచున్నట్లు భూమియందును నెరవేరును గాక, మా అనుదినాహారము నేడు మాకు దయచేయుము, మా ఋణస్థులను మేము క్షమించియున్న ప్రకారము మా ఋణములు క్షమించుము, మమ్మును శోధనలోనికి తేక దుష్టునినుండి మమ్మును తప్పించుము. (రాజ్యము, బలము, మహిమయు నీవైయున్నవి, ఆమేన్) (మత్తయి 6:9-13).

బైబిలు అంతటిలో ఈ లేఖన భాగము బాగుగా ఎరిగినదైయుంది. కీర్తన. 23 మాత్రమే ఎక్కువగా తెలిసినదైయుండవచ్చు. విషాదమేమిటంటే, అనేకులు ఈ ప్రార్థనను కంఠత పెట్టారు గాని హృదయంతో దాన్ని తీసికొన్నవారు కారు. తరువాత కొద్ది నిమిషాలు, ఈ ప్రార్థన నిజంగా ఏమి బోధిస్తుందో చూద్దాం – దానిలోనుండి ఏ సవాలులు మన మీద విసరబడుతున్నాయో గమనించుదాం.

తొలిగా కొన్ని కాదనువాటితో మనం ఆరంభించాలి. అన్నిటికంటె ముందుగా, మత్తయి 6:9-13; లూకా 11:1-4లోని ప్రార్థన ఆచారవిధంగా వల్లించ ఉద్దేశింపబడింది

కాదు. మత్తయి 6:9–13కు ముందుగా వ్యర్థమైన ఉచ్చరింపులకు వ్యతిరేకంగా ప్రభువు హెచ్చరించారు (మత్తయి 6:7). పైగా, "ఈలాగున ప్రార్థన చేయుడి" (మత్తయి 6:9ఎ) లేక "ఈ విధంగా" (KJV) అని ప్రభువు సూచించారు. ఈ పదాలే ఉపయోగించడం కాదు. ప్రభువు ఈ ప్రార్థనను తిరిగి చెప్పినప్పుడు, (లూకా 11:1–4లో), ఆయన సయితం మరల అదే మాటలను ఉపయోగించలేదు. ఆయన మత్తయిలో[2] 68 పదాలు ఉపయోగించితే, లూకాలో[3] కేవలం 37 మాటలనే వినియోగించారు.

రెండవదిగా, "ప్రభువు ప్రార్థన" లేక "పరలోక ప్రార్థన" అనే వాడుక సరియైనది కాదు. చీకటి యుగంలో పేరు తెలియని పండితుడు ఆ ప్రార్థనకు ఈ పేరు పెట్టాడు. ఏదియెలాగున్నా, ప్రభువే ఈ ప్రార్థనను ఎప్పుడైనా ప్రార్థించినట్టు ఏ రికార్డు లేదు.[4] గనుక, ఆయన మాటలను "మాదిరి ప్రార్థన" అని ఆలోచించడానికి నేను యిష్ట పడుతున్నాను. అనేక విధానాల్లో యిది మాదిరియై ఉంటుంది. (1) ఇది విశాలతలో మాదిరియైయుంది: దేవుని ఘనతను అది గుర్తించినదైయుంది. రాజ్యము కొరకును, లోకములో ఉన్న వారందరి కొరకును అది అక్కరను వ్యక్తపరచునదై ఉంది. అది వ్యక్తిగతమైన అవసరతలను సయితం తాకుతుంది. (2) సంక్షిప్తతలోను సరళతలోను అది మాదిరియై ఉంది. అది మత్తయిలో 5 వచనాలలోను లూకాలో మూడు వచనాలలోను చెప్పబడింది. అందులో దీర్ఘమైన రూపాన్ని చదవడానికి కేవలం 20 సెకండ్లు మాత్రమే పట్టుతుంది.[5] అది యింకను యితరమైన విధానాల్లో మాదిరియైయుంది. తరువాత వాటిని చూస్తాం. మన పఠనంలో, మత్తయి 6 పై మన దృష్టిని కేంద్రీకరించి, అవసరమైనప్పుడు లూకా 11ను సూచిస్తాను (మత్తయిలోనిది దీర్ఘమయ్యింది గనుక, సంపూర్ణమైనదై ఉంది).

## దారి చూపుటలో అది మాదిరియైయుంది

దారిచూపుటలో ఈ ప్రార్థన మాదిరియై ఉంది. మొదటిగా, అది దేవుని వైపు చూపించింది: "పరలోకమందున్న మా తండ్రీ" (మత్తయి 6:9బి). మనం దేవునికి ప్రార్థించాలి – మరియకో మరి ఏ యితర పరిశుద్ధునికో కాదు – దేవునికే. "మన ప్రభువైన యేసు క్రీస్తు పేరట సమస్తమును గూర్చి తండ్రియైన దేవునికి ఎల్లప్పుడును కృతజ్ఞతా స్తుతులు చెల్లించు"దని పౌలు తెలిపాడు (ఎఫెసీ. 5:20). మరల మనము తండ్రియైన మన దేవునికి ప్రార్థించాలి. యెహోవా ఎవరికి వ్యక్తిరహిత దేవుడు కాదు; ఆయన తండ్రిగా లక్ష్యపెట్టి, కావలసినవాటిని ఏర్పాటు చేయు తండ్రియైయున్నాడు. పైగా, మనము తండ్రిగా ఉన్న దేవునికి ప్రార్థన చేయాలి. ఇది ఒక మునీశ్వరుడు చేసే ప్రార్థన కాదు. అది ఒకే బిడ్డ చేసే ప్రార్థన కూడ కాదు. "మా తండ్రీ" అనడంలో, మన కందరికి సంబంధించిన సహోదరత్వాన్ని అది గుర్తిస్తుంది. మనం "మన తండ్రికి" ప్రార్థించునప్పుడు, కుటుంబ సంగతులు చర్చించడానికి మనం కూడి వచ్చాం.

దారి చూపడంలో యిది మాదిరి ప్రార్థన ఎందుకంటె అది పరలోకంవైపుకు మళ్లించబడింది: "పరలోకమందున్న మా తండ్రీ" (మత్తయి 6:9బి). ఈ లోకము దేవుని

సృష్టియు ఆయన సొత్తుయునై యున్నది, కాని యిది ఆయన యిల్లు కాదు. మన భక్తి పరలోకమునందు కేంద్రీకరించబడియుంది. ప్రభువైన యేసు పరలోకమునుండి అరుదెంచి తిరిగి ఆయన వెళ్లారు. ఇప్పుడు ఆయన పరలోకమందు దేవుని కుడిపార్శ్వమున ఆసీనులైయున్నారు, మనకొరకు విజ్ఞాపన చేస్తున్నారు. తనవారిని సమకూర్చుకొనడానికి ఆయన పరలోకంనుండి దిగివస్తారు వారితో ఆయన పరలోకమందు నిత్యత్వం గడుపుతారు. "మన పౌర స్థితి పరలోకములో ఉన్నది" అని పౌలన్నాడు (ఫిలిప్పీ. 3:20). "పరలోకమందు మీ పేరులు వ్రాయబడియున్నవని సంతోషించుడి" అని ప్రభువు తన శిష్యులతో చెప్పారు (లూకా 10:20). "మన ఆస్తిని పరలోకములో కూర్చుకొనమని ప్రభువు సెలవిచ్చారు" (మత్తయి 6:20).

## భయభక్తులతో కూడిన మర్యాదకు మాదిరి

ఆ ప్రార్థన భయభక్తులతో కూడిన మర్యాదకు సయితం మాదిరియైయుంది. దేవుడు మామూలైన ఒక స్నేహితుడు కాదు;[6] ఇక్కడ మన తండ్రి ఉన్నారు – ఆయన నామము పరిశుద్ధమైనది. "నీ నామము పరిశుద్ధపరచబడును గాక" అంటూ ఆ ప్రార్థన కొనసాగింది (మత్తయి 6:9సి; లూకా 11:2బి). అది పరిశుద్ధమైనదని గౌరవించు.[7] పాత నిబంధనలో "ఆయన నామము పరిశుద్ధమైనది, పూజింపదగినది" అని కీర్తన రచయిత అన్నాడు (కీర్తన 111:9సి) "నీ దేవుడైన యెహోవా నామమును వ్యర్థముగా నుచ్చరింప కూడదు" అని మోషే ఆజ్ఞాపించాడు (నిర్గమ. 20:7ఎ). ఆ సంగతి మనం ఎరిగేలా, ప్రభువు నేర్పిన మాదిరి ప్రార్థన తెలుపుతుంది. క్రొత్త నిబంధనలో సయితం, అత్యంత భక్తి మర్యాదలతో దేవుని సమీపించవలసియుంటుంది.

## నొక్కి పలకడంలో మాదిరి

ప్రార్థనయందు మన విన్నపములను తెలుపవచ్చుటకు యిప్పుడే ప్రస్తావించబడిన భక్తి కంఠస్వరాన్ని నిలుపుతుంది. ప్రారంభములో విషయము తన కొరకు కాక, దేవుని సంకల్పము, ఆయన ఉద్దేశాలను కనుపరచునదై యుంది: "నీ రాజ్యము వచ్చును గాక" (మత్తయి 6:10ఎ; లూకా 11:2సి).

వారు ఎదురు చూస్తున్న "రాజ్యము" ఏది? అది సంఘము: మెస్సీయ రాజ్యానికి సంబంధించి కొన్ని కీలకమైన లేఖన భాగాలను రివ్యూ చేద్దాం:

- *దానియేలు 2:44.* రోమా సామ్రాజ్య కాలంలో మెస్సీయ రాజ్యము వస్తుందని దానియేలు ప్రవచించాడు.[8]
- *మత్తయి 3:2; 4:17.* రోము లోకాన్ని ఏలుతూ ఉండగా, "పరలోకరాజ్యము సమీపించియున్న"దని బాప్తిస్మమిచ్చు యోహాను, ప్రభువైన క్రీస్తూ ప్రకటించుతూ వచ్చారు.

- *మత్తయి 16:18, 19.* ఫిలిప్పుదైన కైసరయలో, క్రీస్తు తన రాజ్యాన్ని స్థాపించడాన్ని గూర్చి మాట్లాడారు; ఆయన దాన్ని తన "సంఘ"మని పిలిచారు.
- *మార్కు 9:1.* రాజ్యము వారి జీవిత కాలంలోనే వస్తుందని క్రీస్తు తన శిష్యులకు తెలిపారు, మరియు అది "బలముతో" వచ్చునని సూచించారు. పరిశుద్ధాత్మ వచ్చునప్పుడు ఆ శక్తి వస్తుందని ఆయన తరువాత తెలిపారు (అపొ. 1:6–8).
- *అపొ. 2:1–4.* క్రీస్తు మరణ, సమాధి, పునరుత్థానాల అనంతరం వచ్చిన తొలి పెంతెకొస్తు దినాన పరిశుద్ధాత్మ వచ్చాడు. అప్పుడు శక్తి వచ్చింది – మరియు సంఘ రాజ్యము స్థాపించబడింది.
- *అపొ. 2:47.* ఆ సమయంనుండి సంఘము/రాజ్యము ఉనికిలో ఉన్నట్టు చెప్పబడింది. జనులు రక్షింపబడినప్పుడు, ప్రభువు వారిని సంఘమునకు చేర్చుచుండెను (KJV), దేవుడు వారిని "అంధకార సంబంధమైన అధికారములో"నుండి విడుదల చేసి "తాను ప్రేమించిన తన కుమారుని రాజ్యనివాసులుగా చేస్తున్నాడు" (కొలస్సీ. 1:13). క్రైస్తవులు నిశ్చలమైన రాజ్యములో ఉన్నారు (హెబ్రీ. 12:28) – పాతాళలోక ద్వారములు దానియెదుట నిలువనేరని సంఘములో ఉన్నారు (మత్తయి 16:18)!

"నీ రాజ్యము వచ్చునుగాక" అని ప్రభువు తన శిష్యులకు ప్రార్థించ నేర్పినప్పుడు, "నీ సంఘము స్థాపింపబడును గాక" అని ప్రార్థించ నేర్పారు. దేవుని ఘనమైన శాశ్వతమైన సంఘమునకైన సంకల్పంలో తన శిష్యులు సయితం పాలివారు కావాలని ప్రభువు వారిని అడుగుతున్నారు (ఎఫెసీ. 3:10, 11).

ప్రార్థనలో ఈ భాగాన్ని నేడు మనం ప్రార్థించవలెనా? సంఘము/రాజ్యము ముందుగానే స్థాపింపబడియుండగా, ఆ పదాలే తిరిగి ఉపయోగించకయుండడం అతి శ్రేష్ఠం. "నీ రాజ్యము లోకమంతటను వ్యాపించును గాక," లేక "నీ రాజ్యము సకల మనుష్యుల హృదయాలలో విస్తరించును గాక" అని మనం అనవచ్చు. అలా కాకుండ, మాటలు ఉన్నట్టే వల్లించితే, క్రీస్తు రాజ్యం యింకా రాలేదని నమ్మే వెయ్యేండ్ల పరిపాలనా వాదులకు మనం చోటిచ్చినట్లౌతుంది.

రాజ్యము వచ్చునుగాక అనే పదాలు మనం ఉపయోగించనవసరం లేదు. అది వచ్చియే ఉన్నది. మనం స్థానికంగా కూడే సంఘం కొరకు ప్రార్థించాలి; లోకమంతటిలో ఉన్న సంఘంకొరకు ప్రార్థించాలి. మనం అలా జరిగించడంవలన, "దేవుడు మన ప్రభువైన క్రీస్తుయేసునందు చేసిన నిత్య సంకల్పమునునుసరించిన తన జ్ఞానాన్ని" "సంఘం ద్వారా" తెలియజేయడంలో మనము పాలివారమై యుండవచ్చు (ఎఫెసీ. 3:10–11)!

## దాని శ్రద్ధలో మాదిరియైయుంది

తరువాత విన్నపము ఆత్మ సంబంధమైన దానియందు అక్కర చూపుతుంది, అయితే

యిప్పుడు నొక్కి చెప్పేది సంఘము/రాజ్యమునుండి లోకమంతటికి విస్తరిస్తుంది: "నీ చిత్తము పరలోకమందు నెరవేరునట్లు భూమియందును నెరవేరును గాక" (మత్తయి 6:10బి, సి). లోకమందలి ప్రతి ఒక్కరు దేవుని చిత్తానికి లోబడాలనే కోర్కె వ్యక్తపరచబడింది. అలాంటి అవకాశాన్ని గూర్చి ధ్యానించడానికే మనస్సు తడబడుతుంది. ఆయన చిత్తము పరలోకంలో ఎలా నెరవేర్చబడుతుందో ఆలోచించు. దేవుని సింహాసనం ఎదుట నిలిచే దూతలు ప్రధాన దూతలను నీ మనస్సులో చిత్రించుకో. ఆయన ఆజ్ఞలకు చెవియొగ్గి వాటిని జరిగించడానికి ఎలా తహతహలాడుతూ ఉంటారో! ఆ రూపంలో దేవుని చిత్తం భూమిమీద నెరవేరితే ఎంత అమోఘంగా ఉంటుందో!

ప్రార్థనలో ఈలాటి భాగానికి జవాబు పొందాలంటే, తన వాక్యమందు దేవుని చిత్తం బయలుపరచబడినందున, ఆ వాక్యాన్ని లోకమంతటికి మనం కొనిపోవలసి యుంటుంది (మత్తయి 20:18–20; మార్కు 16:15, 16). దేవుని ఆజ్ఞలకు లోబడేలా ప్రతి స్థలంలోని ప్రజలను మనం ప్రోత్సహించాలి.

ఏదియెలాగున్నా, ఈ భాగంలో ఉన్న ప్రధానమైన విలువ ఏమంటే, ఆయన చిత్తం పట్ల మన స్వభావం ఎట్టిదైయుందో పరీక్షించుకో. యథార్థంగా చెప్పాలంటే, మన జీవితాలకొరకైన దేవుని చిత్తం విషయంలో మనలో ఎక్కువ మందిమి ఎల్లప్పుడు ఆనందంగా ఉండలేం. "పరలోకపు దేవుని చేతినుండి తమకు అప్పగింపబడే బాధ్యతల విషయంలో యిష్టములేనివారై యుంటారని" ఒక వ్యక్తి అన్నాడు. "భూమిమీద నా చిత్తము జరుగును గాక" అన్నట్టు కొందరు ప్రార్థించారు. ప్రార్థన యొక్క ఉద్దేశం దేవుని మన యిష్టానికి లోబరచుకొనడం కాదు; మన యిష్టాలు ఆయన చిత్తానికి లోబడేలా నేర్చుకొనడమే.

## నిగ్రహములో మాదిరియైయుంది

ప్రార్థనలో సగంవరకు వచ్చాం, యింతవరకు వ్యక్తిగతమైన మనవి ఏమీ చేయ బడలేదు – అయితే ఒకదానికి మన హృదయాలు సిద్ధపరచబడవలసియుంది. "మా అనుదినాహారము నేడు మాకు దయచేయుము" (మత్తయి 6:11). "మాకు కావలసిన అనుదినాహారము మాకు దయచేయుము" అని లూకాలో ఉంది (లూకా 11:3). ఈ ప్రార్థనలోని నిగ్రహాన్ని గమనించు: ఇది విలాసముల కొరకైన ప్రార్థన కాదు,[9] ఆహారము కొరకు. నెల రోజుల ఆహారం కొరకైన ప్రార్థన కాదు, దినావసరతల కొరకైన ప్రార్థన.

ప్రార్థనలో ఈ భాగం నేర్పించే పాఠం జీవిత అవసరతలతో మనం తృప్తిపొందాలనేది. మనకు అత్యవసరమైనవాటిలో ఆహారం ఒకటి, ఇతర దీవెనలకొరకు ప్రార్థించడం తప్పని కాదు, కాని సంతోషం వస్తువులను సమకూర్చుకొనడం మీద ఆధారపడకూడదు. "అన్న వస్త్రములు కలవారమై తృప్తి పొందియుందము" అని పౌలు రాశాడు (1 తిమోతి 6:8).

ప్రార్థనలోని ఈ భాగమందు యితర పాఠాలు కన్పిస్తాయి. ఉదాహరణకు, దేవుడు సమస్త దీవెనలకు ఆధారభూతుడైయున్నట్టు మనం గుర్తించుకోవాలి. అనుదినాహారమంత

చిన్న ప్రాథమిక అవసరత కొరకు సయితము మనము ఆయనకు ప్రార్థించాలి. “చూడు, నేనేమి చేశాను” అనకుండ, “దేవుడు నాకొరకు ఏమి చేశాడో చూడు” అని అనాలి. మనకు కలిగినదంతయు, మార్గంలో మనం ఏరుకున్నదంతయు, అలా “ఏరుకునేలా” దీవెనలను మార్గంలో పెట్టినవాడు దేవుడే. మనం మన దినాహారం కొరకు పనిచేయాలి (2 థెస్స. 3:11, 12), కాని ఆ దీవెనకు చిట్టచివరి మూలము దేవుడై ఉన్నట్టు గుర్తించాలి. ఈ సత్యాన్ని గుర్తుచేయడానికి ఒక వచనం పని చేస్తుంది:

రొట్టెకు వెనుక పిండి ఉంది,
పిండికి వెనుక మర ఉంది;
మిల్లుకు వెనుక గోధుమలున్నాయి.
అక్కడ కొండమీద ఆడించబడుతుంది;
ఆ కొండవెనుక సూర్యుడున్నాడు
మరియు వర్షమును, తండ్రి చిత్తమును ఉన్నాయి.

ప్రభువు నేర్పిన ఈ ప్రార్థన స్వార్థరహితంగా ఉండాలని గుప్తం చేస్తుంది. మనము “నా దినాహారము” కొరకు కాదు, “మీ దినాహారము” కొరకు ప్రార్థించాలి. ప్రార్థన అంతటిలో క్రైస్తవ సమాజముపై నొక్కి చెప్పబడింది. తిరిగి ఆ ప్రార్థనను చదువు. “నేను” అనే వ్యక్తిగతమైన సర్వనామము కన్పించదు. ప్రార్థన యితరుల కొరకైన అక్కరలతో నిమగ్నమైయుంది.

## అణకువకు మాదిరియైయుంది

ప్రార్థనలో మరొక వ్యక్తిగతమైన విన్నపం తరువాత వస్తుంది.“మా ఋణములను క్షమించుము” (మత్తయి 6:12ఎ). “ఋణము” అనేదానికి గ్రీకులో అచ్చియున్న అని అర్థం యిస్తుంది. అయితే ఈ సూచన ఆత్మ సంబంధమైన ఋణముగాని, ఆర్థికపరమైన ఋణం కాదు. క్రొత్తనిబంధనలో “ఋణము” అనేది దోషము, లేక పాపము, నేరము – ఏకవచనంలోనే ఉపయోగింపబడింది[10] లూకాలో, “మా పాపములను క్షమించుము” అని ఉంది (లూకా 11:4ఎ).[11] పరిశుద్ధ దేవుని యెదుట నిలబడి మనం పాపులమని ఒప్పుకొని మన పాపములను క్షమించుమని దేవుని అడుగుతాం. ఇది మన హృదయపు గర్వంమీద దెబ్బకొడుతుంది.

ఆ తరువాత మనవి మన అహంమీద బహు తీవ్రమైన దెబ్బకొడుతుంది, “మా ఋణస్థులను మేము క్షమించియున్న ప్రకారము” (మత్తయి 6:12బి). క్షమించడం ఎంతో కష్టమైన పని! మనలను ఎవరైనా బాధించినప్పుడు, మన అహం, మన గర్వం గాయపరచబడుతుంది. “నేను వీనిని ఎన్నడూ క్షమించను” అని మనం అనుకోవచ్చు, మన హృదయాల్లో అట్టి వ్యక్తిని క్షమించడం ఎంత కష్టతరమైయుంటుంది! ఇది అంత “ముఖ్యమైనది కాదు, నేను విడిచిపెడతానన్నట్టుగా భావింప నేర్చుకోవాలి; యిది చిన్న పని కాదు.”

మత్తయి 6:12 మీద గట్టిగా బోధించే ప్రయత్నాలు జరిగాయి (14, 15 వచనాలు

చూడు). "మారుమనస్సు పొంది క్షమాపణ అడగని వ్యక్తిని నేను నిజంగా క్షమించ గలనా?" అని ఒకడు అడుగుతాడు. లూకా 17:3ను, మనం మారుమనస్సు పొందేవరకు దేవుడు క్షమించడు అని అంటారు. అయితే, యిక్కడ మనం మాట్లాడుతున్నది సహవాస పునరుద్ధరణ కాదు; కాని మన హృదయపు స్వభావాన్ని గూర్చి "తండ్రీ, వీరేమి చేయుచున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమించు"మని సిలువపైనుండి ప్రభువు ప్రార్థించారు (లూకా 23:34ఎ). ఆయన ఆ ప్రార్థనను ఉచ్చరించినా, వారుగా మారుమనస్సు పొందేవరకు వారి హృదయ దోషము వారిపైననే ఉంది (అపో. 2:36–38). ఏదియెలాగున్నా, ఇక్కడ మనం నేర్చుకొనవలసిందేమంటే. ప్రభువువలె క్షమించు హృదయం కలిగియుండాలి. ఎవరైనా నాకు హాని చేస్తే, ఆ విషయం ఆ వ్యక్తి గుర్తించేవరకు ఆ వ్యక్తితో సంబంధం కళంకంగానే ఉండవచ్చునేమో గాని, అయితే నా హృదయం మాత్రం తన పట్ల ఏ విధమైన శత్రుత్వాన్ని లేకుండ చూచుకొనడం నాకు అక్కరయైయుంది. "చేదైన వేరు ఏదైనను మొలవకుండ" (హెబ్రీ. 12:15) జాగ్రత్తపడాలి అది నా హృదయాన్ని నింపి యితరుల పట్ల నా ప్రేమను అది పాడుచేయక ఉండాలి.

"మేము మాకచ్చియున్న ప్రతివానిని క్షమించుచున్నాము గనుక" అనే మాటలు లూకాలో ఉన్నాయి (లూకా 11:4ఎ). మనం క్షమించ నిష్టపడకుంటే, ఏమి జరుగుతుంది? "క్షమించే మనస్సు లేని మనిషి తాను నడువవలసిన వంతెనను తానే కూల్చుకొనువాడై యున్నాడని" ఒక వ్యక్తి అన్నాడు. మాదిరి ప్రార్థనానంతరం, ఆలోచనను రేకెత్తించే ప్రభువు పలికిన మాటలను ఆలోచించు: "మనుష్యుల అపరాధములను మీరు క్షమించిన యెడల, మీ పరలోకపు తండ్రియు మీ అపరాధములను క్షమించును. మీరు మనుష్యుల అపరాధములను క్షమింపక పోయినయెడల మీ తండ్రియు మీ అపరాధములను క్షమింపడు" (మత్తయి 6:14, 15).

## అంతర్ దృష్టిలో మాదిరియైయుంది

"మమ్మును శోధనలోకి[12] తేక దుష్టునినుండి తప్పించుము" అంటూ ప్రార్థన కొనసాగుతుంది (మత్తయి 6:13ఎ; లూకా 11:4సి). మాదిరి ప్రార్థన అంతర్ దృష్టిగలది. ఎందుకంటే, పాపక్షమాపణ విషయంలో అది అక్కర చూపినది మాత్రమే గాక, పాపమునకు నడిపించు దానినుండి కూడ అది దూరంగా ఉండాలంటుంది.

"కీడు"నుండి అని సాధారణంగా అనకుండ గ్రీకులో ఉన్నట్టుగానే "దుష్టునినుండి"[13] అని ఉంది. సమస్త దుష్టత్వానికి అపవాది మూలము గనుక, "కీడు" కలిగించే లేక "దుష్టత్వాన్ని" కలిగించే "దుష్టుని"నుండి తప్పించమనడం కోరబడింది.

శోధననుండి తొలిగి దూరంగానుండ సహాయమునకై దేవునికి విన్నవించడం ప్రార్థనలో ఈ భాగం బోధిస్తుంది,[14] సాతానును ఓడించడానికి సహాయం కూడ అవసరమై యుంటుంది. ఆ బాధ్యతను అది మనమీద మోపుతుంది. మనకండ్లు బాగా తెరుచుకొని శోధింపబడే పరిస్థితులలోనికి వెళ్లి, సంకటంలో మునిగిన తరువాత దానిలోనుండి బయటికి తెమ్మని మనం ఎక్కువసార్లు దేవుని వేడుకొంటాం. శోధింపబడే పరిస్థితులలోనికి

కావాలనే వెళ్లి, "మమ్మును శోధనలోనికి తేక" అని న్యాయసమ్మతంగా ప్రార్థించలేం.

## స్తుతించుటలో మాదిరియైయుంది

ఈ మాదిరి ప్రార్థనలో చివరి మాటలు, తెలుగులో క్రింద చిన్న అక్షరాలలో వ్రాయబడ్డాయి – "రాజ్యము, బలము, మహిమయు నీవైయున్నవి, ఆమేన్" (మత్తయి 6:13బి). ఈ ముగింపు ప్రాచీన చేతి ప్రతులలో లేదు. అయితే సంఘము యొక్క ఆరంభ శతాబ్దాలలో ఈ పదాలు ఉపయోగింపబడినట్టు ఆధారముంది. – తర్జుమాల్లో దాదాపుగా అన్నిటిలో ఈ మాటలు మార్జిన్‌లోనో, క్రింది నోట్‌లోనో ఉన్నాయి. ప్రార్థన ముగించడానికి అది తగిన విధానమే. అవన్నీ తిరిగి సమస్త మేలులకు మూలమైయున్న దేవుని యొద్దకే వచ్చాయి:

- "రాజ్యము ఆయనది." రాజ్యము ఆయనకే చెందుతుంది, ఆయన అన్నిటికి పైగానున్నవాడు. ఆ సత్యాన్ని మనం గుర్తించి తీరాలి.
- "శక్తియు ఆయనదే." మానవుడు కలిగియున్న శక్తి ఎంతటిదైనా, దేవుని శక్తితో దాన్ని పోల్చితే, అది లేనట్టేయనిపిస్తుంది. మనం ఈ వాస్తవాన్ని కూడ గుర్తించాలి.
- "మహిమయు ఆయనదే," మనం దాన్ని ప్రకటించాలి.
- ఇదంతయు "నిరంతరము" సత్యమైయున్నది, "ఆమేన్" ఆమేన్!

## ముగింపు

ఇదే మాదిరి ప్రార్థన. ప్రార్థనను గూర్చి నీవు నేను ఎరుగవలసినదంతయు అది బోధిస్తుందా? లేదు. ఉదాహరణకు, అది ప్రభువైన యేసు నామమున లేదు. మోషే ధర్మశాస్త్రము ఇంకను అమలులో ఉండిన కాలంలో అది నేర్పబడింది. క్రొత్తనిబంధన క్రింద. "... ప్రభువైన యేసు[15] ద్వారా తండ్రియైన దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచు, సమస్తమును ఆయన పేరట చేయుడి" అని పౌలు ఉపదేశించాడు (కొలస్సీ. 3:17).

పైగా, మాదిరి ప్రార్థనలోని విన్నపాలు సాధారణమైనవి. నీవు నేను ప్రార్థించినప్పుడు నిర్దిష్టమైనవాటికొరకు చేయాలి: ప్రత్యేకంగా సూచింపబడిన దీవెనలకు మనం కృతజ్ఞతలు చెల్లించాలి; ప్రత్యేకంగా చేసిన పాపాలను మనం ఒప్పుకోవాలి; ప్రత్యేకించిన ప్రజల కొరకు మనం ప్రార్థించాలి.

ఏదికాకపోయినా, మాదిరి ప్రార్థననుండి మనం ఎంతో నేర్చుకోవలసియుంది. ముందుగా గమనించినట్టే, అది: దారి చూపుటలోను, భయభక్తులు చూపుటలోను, నొక్కిపలకడంలోను, శ్రద్ధకనుపరచుటలోను, నిగ్రహము ప్రదర్శించుటలోను, అణకువలోను, అంతర్ దృష్టిలోను, స్తుతించుటలోను మాదిరియైయుంది.

మనం ముగించుతుండగా, నేను జ్ఞాపకం చేయవలసిందేమంటే – "పరలోకమందున్న

మా తండ్రీ" (మత్తయి 6:9బి) అంటూ ఈ ప్రార్థన ఆరంభమౌతుంది. దేవుడు నిజంగానే నీకు తండ్రికానట్టయితే, నీవు ఈ ప్రార్థన యథార్థంగా పలుకలేవు. ఆయన నీకు తండ్రియా? నీవు ఆయనకు బిడ్డవా? విశ్వాసము, విధేయతల ద్వారా నీవు ఆయన కుటుంబంలోనికి జన్మించావా? పౌలు యిలా రాశాడు: "యేసుక్రీస్తునందు మీరందరు విశ్వాసమువలన దేవుని కుమారులైయున్నారు. క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొనియున్నారు" (గలతీ. 3:26, 27). మారుమనస్సు పొందిన విశ్వాసిగా నీవు బాప్తిస్మము పొందియున్నట్టయితే, నీవు దేవుని బిడ్డగానే జీవించావా లేక ఆయన కుటుంబమైన సంఘమునకు అవమానం తెచ్చావా (1 తిమోతి 3:15)? నీవు బాప్తిస్మం పొందవలసియున్నా, పునరుద్ధరింపబడవలసియున్నా, (గలతీ. 6:1; అపొ. 8:22; యాకోబు 5:16 చూడు), నేడే నీవు ఆ పని చేయుమని నా ప్రార్థన.

## నోట్సు

నేను బోధించేటప్పుడు, లూకా 11:1-4ను ఎవరి చేతనైనా బోధించుటకు ముందు చదివిస్తాను. ఈ విధంగా చేయడంవల్ల నేను గమనించదగిన అంశాలను చెప్పినప్పుడు అవి శ్రోతల మనస్సులో బాగా నాటుకుంటాయి. ఎలాగంటే నేను ప్రభువు సమాధానం "ప్రార్థన"గా పిలువబడుతుంది అని చెప్పినప్పుడు "మీరిప్పుడే లూకా వివరణ విన్నారు కదా." ఇది మత్తయిదని చెప్తాను. అలా చెప్పాక మత్తయి 6ను చదువుతాను.

ఈ ప్రసంగం మీద నా దగ్గరున్న మూలం చాలా రోజుల క్రితం రాసినది. నేను ఇతరుల అభిప్రాయాలకు సరియైన విలువనివ్వకపోతే అందుకు నా క్షమాపణను కోరుతాను.

---

సూచనలు

[1]ఈ పాఠమును ఉపదేశించేటప్పుడు శ్రోతలకు అవసరమైన ప్రశ్నలను చేర్చుము. [2]NASBని మత్తయి వివరణలో 13వ వచనం చేర్చుకొని 68 పదాలు ఉన్నాయి. KJVలో 66 ఉన్నాయి. మత్తయి 6:13 మినహాయించి గ్రీకులో 57 పదాలున్నాయి. [3]లెక్కింపు NASBని ఆధారము చేసికొని చేయబడింది. KJVలోని లూకా సువార్తలో 58 పదాలు, గ్రీకులో 38 పదాలు ఉన్నాయి. [4]నిజమైన "ప్రభువు ప్రార్థన" యోహాను 17లో ఉంది. [5]వ్యక్తిగతమై దీర్ఘ ప్రార్థనలు తప్పు కావు. యేసు రాత్రంతా ప్రార్థించారు. సమాజం మధ్య ప్రార్థించినప్పుడు ఫల భరితంగా ఉండాలంటే ప్రార్థించుటకు చాలా సమయం తీసుకోరాదు అనే విషయాన్ని జ్ఞాపకముంచుకో. [6]వీటికి సంబంధించిన పద ప్రయోగాన్ని ఉపయోగించు. [7]*The Analytical Greek Lexicon* (London: Samuel Bagster & Sons Ltd., 1971), 3. [8]నాలుగవ రాజ్యం కాలములో ఒక రాజ్యం స్థాపించబడుతుందని దానియేలు ప్రవచించాడు. ఆ నాలుగవ రాజ్యం రోమా సామ్రాజ్యమని చరిత్ర ద్వారా తెలుసుకోగలం. దానియేలు 2:44పై వ్యాఖ్యానాన్ని "దానియేలు, 1" ఆంగ్ల సంచికను చూడు. [9]ఈ ప్రతిపాదనను నీవు నివసిస్తున్న ప్రజలకు తగిన దానిని ఉపయోగించు. [10]ఈ ప్రార్థనను ఉపయోగించువారిలో "పాపము" అను అర్థమిచ్చు "అతిక్రమము" అనే పదముంది.

[11]లూకా "పాపములు," "ఋణములు" అనే పదములను పర్యాయ పదాలుగా ఉపయోగించాడు. [12]"టెంప్టేషన్" అనే గ్రీకు పదానికి చాలా అర్థాలున్నాయి. కాని ఈ స్తోత్రంలో "చెడు" అనేదానికి పర్యాయంగా వాడబడింది. ఈ సందర్భంలో చెడు చేయడానికి. [13]NKJVలో "చెడ్డదైన" అని ఉంది. [14]దేవుడు ఎవ్వరిని పురికొల్పడు (యాకోబు 1:13), మమ్మల్ని ప్రలోభములోనికి లాగకు అంటే మమ్ములను దురాశలకు నడిపింపక సహాయము చేయుము అన్న అర్థాన్నిస్తుంది. [15]మనకు తెలిసిన "ప్రభువు పేరున" అనే పదబంధం కేవలం ఊరికే మనం చెప్పేది కాదు. అది ప్రభువు మన మధ్యవర్తి అన్న గ్రహింపుకు ఆనవాలుగా ఉంటుంది (1 తిమోతి 2:5).